# రిస్క్

కావలసిన లోన్సు ఇస్తామంటూ పాపుపేజీ ప్రకటన. బ్యాంకు ఏభై ఏళ్లు పూర్తిచేసిన సందర్భంలో అందులోని ప్రముఖుల ఫోటోలు వేసి సందేశాలు, శుభాకాంక్షలు గుప్పించేశారు. ఎంత తక్కువ స్థాయిలో ప్రారంభించి ఎన్ని ఉన్నత శిఖరాలు చేరుకుందీ రాశారు. 'మా కష్టమర్లే మా పోషకులు' అనే దీక్షావాక్యం లాంటిదికూడా పెద్ద రంగు అక్షరాలలో చూడడానికి ఆకర్షణీయంగా ఉంది.

"హాయ్ మృదులా!" అంటూ లోపలికి వచ్చింది లావణ్య. "కాన్ఫరెన్స్ రూమ్‌లో ప్రెజెంటేషన్సుకు వెళ్లొద్దూ?" అంటూ కుర్చీలో కూర్చుంది.

నేను ఏమిటన్నట్టు చూశాను.

"సర్క్యులర్ రాలేదా? ఈ రోజు నాలుగు పి.ఆర్. ఏజెన్సీలు వస్తున్నాయి కదా మన పబ్లిసిటీ ప్రాజెక్టు కోసం?"

"ఓ! మరిచేపోయాను."

"మేడమ్!" అంటూ పర్సనల్ సెక్రటరీ సురేష్ లోపలికి వచ్చాడు. "పదకొండున్నరకు కాన్ఫరెన్స్ రూమ్‌లో మీటింగ్. ప్రెజెంటేషన్స్, ఇవి బ్యాక్ గ్రౌండ్ పేపర్స్" అంటూ నీటుగా ఉన్న ఫోల్డర్ టేబులుమీద పెట్టాడు.

"థాంక్యూ, సురేష్!"

అతను వెళ్లిపోయాడు.

"ఇంకా పది నిమిషాల టైముంది. ఇంతకూ నువ్వేమిటంత దీక్షగా చూస్తున్నావు?" అనడిగింది లావణ్య.

"ఈ అడ్వర్‌టైజ్‌మెంట్ చూడు. బ్యాంకులు కూడా ఋణాలిస్తామంటూ ఎంత పోటీపడి ముందుకొస్తున్నాయో! ప్రైవేటువాళ్లు సరేసరి. గ్యారంటీలు వద్దు. ఫైళ్ల గొడవ లేదు. డైరెక్టుగా లోను ఇస్తామంటారు."

"మరికొందరు జీరో ఇంటరెస్ట్ అంటారు. ఇదంతా మార్కెట్ ప్రభావం, మృదులా! కార్లు, ఇళ్లు కొనడానికి, ఖరీదైన వస్తువులు తీసుకోవడానికి అప్పు లిస్తారు. మనకు తాహతులేని వస్తువులు కొనేటట్లు చేస్తారు. ఒకప్పుడు ఇటువంటి సుఖాలకు, ఆడంబరాలకు ఎన్నెన్ని సంవత్సరాలు వేచి ఉండాల్సివచ్చేది. ఒక స్కూటరు కొనాలన్నా, ఒక ఫ్రిజ్ కొనాలన్నా ఆచి తూచి ముందడుగు వేయాల్సి వచ్చేది. ఇల్లు కొనడం,

కారు కొనడం ఒక జీవితకాలం పట్టేది. ఇప్పుడు? జీవిత ప్రారంభంలోనే కావలసినవన్నీ అమరుతున్నాయి."

"మంచిదే కదా. అప్పుడు పొదుపు చేసి కొనేవారు. ఇప్పుడు కొని పొదుపు చేస్తున్నారు- అప్పులు చెల్లించుకోడానికి."

"ఏమో, మృదులా, మధ్యతరగతి కుటుంబాలలో పెరిగి అన్నిటికీ పొదుపు పొదుపు అంటూ అమ్మానాన్నా వల్లెవేసిన మాటలు వింటూ వచ్చామేమో; ఒక్కసారిగా అప్పులు చేసి ఇల్లు విలాస వస్తువులతో నింపుకోవడానికి భయమేస్తోంది."

"కాలం మారుతోంది, లావణ్యా! గడచిన ఒక్క క్షణంకూడా వెనక్కి రాదు కదా. అందుకే ఉన్న అవకాశాలు వాడుకోవాలి. పర్మనెంట్ ఉద్యోగాలుండి, మంచి జీతాలొస్తున్న మనమే అప్పులకు భయపడితే ఎలా?"

"నువ్వన్నమాట నిజమే. ఇంతకూ ఆ అడ్వర్‌టైజ్‌మెంటు నీవెందుకు చూస్తున్నట్టు?"

నాకు నవ్వొచ్చింది. "లోన్‌కోసం."

"నీకు లోనెందుకు?" తను అడిగింది.

"కారు కొనడానికి."

"వెరీ గుడ్. అప్పుకాక ఇంకో మార్గం లేదా?"

"ఆలోచిస్తే ఉంటుంది. కాని, మూలమూలలనుండి అంతా ఊడ్చిపెట్టి కారు కొనడం తెలివైనపని అనిపించుకోదు. తర్వాత ఏదైనా ఎమర్జన్సీ వస్తే ఎవరాదుకుంటారు? నేను సర్వీసులో చేరిన కొత్తలో ఒక అకౌంట్సు ఆఫీసరు ఇచ్చిన సలహా ఏమిటంటే- లోనుకు మించిన సేవింగ్సు లేదని."

"భలే చమత్కారంగా ఉందే. ఇంకేం బ్యాంకుకు వెళ్లి లోన్ అప్లికేషన్ ఇచ్చిరా. ప్రస్తుతానికి కాన్ఫరెన్స్ రూమ్‌కు బయలుదేరు. లేకపోతే లేటవుతుంది."

శనివారం ఆఫీసుకు సెలవే కనుక బ్యాంకుకు వెళ్లి లోన్ అప్లికేషన్ ఇచ్చివచ్చాను. అక్కడి ఆఫీసర్ చాలా మర్యాదగా, స్నేహపూర్వకంగా మాట్లాడాడు. లోన్ శాంక్షన్ కాగానే స్వయంగా ఫోన్ చేస్తానన్నాడు. ఇదంతా బ్యాంకులు ప్రజలను ఆకట్టుకునే పద్ధతి అని తెలుస్తూనే ఉంది. అతనికి థాంక్స్ చెప్పి ఇంటికి వచ్చాను.

అప్పటినుండి నా దృష్టి అంతా కార్ల ప్రకటనలమీదే. టీవీలో మరీ గ్లామరస్ ప్రకటనలు. నా కంత లగ్జరీ అవసరం లేదు. ఏదో ఒక చిన్నకారు ఆఫీసుకు తిరగడానికి, మార్కెటుకు, ఫంక్షన్లకు-వెళ్లడానికి బాదరబందీ లేని ఒక మార్గం.

నాకు స్కూటర్ల మీద ఎప్పుడూ మక్కువ లేదు. అందుకే ఇప్పటివరకూ సొంత వాహనమంటూ ఏదీ లేదు. రానురాను ఈ మహానగరంలో ఎక్కడికి వెళ్లాలన్నా ఇబ్బందే.

ఆఫీసుకైతే ఛార్టెడ్ బస్సులున్నాయి. వెళ్లేటప్పుడు ఫర్వాలేదు కాని, తిరిగి వచ్చేటప్పుడే బాధ. ఆఫీసులో మీటింగులు, చర్చలు చాలావరకు సాయంత్రాలుంటాయి. ఇంచుమించు రోజూ ఆలస్యమవుతుంది. ఆటోలకు బోలెడు ఛార్జీలు. వాళ్లడిగినంతా ఇవ్వాలి. వెళ్లాలనుకున్న చోటికి రారు. ఈ బాధలన్నీ పడలేకే కారు కొనాలనుకున్నది. సీనియర్ ఆఫీసరయ్యే కొద్దీ బాధ్యతలూ పెరుగుతాయి. కచ్చితంగా తొమ్మిదీ... అయిదూ మధ్యే పని చేస్తానంటే కుదరదు. ఒకోసారి సెలవు రోజుల్లోనూ వెళ్లాల్సి ఉంటుంది. మనం పని చేసేదాన్నిబట్టి, శ్రద్ధనుబట్టి మన టీమ్ కూడా పని చేస్తుంది.

ఇంట్లో నాకు సాయం చేయడానికి కమల ఉంది కాబట్టి సరిపోయింది. లేకపోతే చాలాసార్లు పండ్లూ, పాలూ, బిస్కెట్లతో సరిపుచ్చుకోవలసి వచ్చేది.

సోమవారం లావణ్య అడిగింది "నీ కారు లోను ఏమైంది?" అని.

"అప్లికేషన్ పెట్టాను. పదిహేను రోజుల్లోనే శాంక్షన్ అవుతుందని చెప్పారు. వాళ్లు పెట్టిన షరతులన్నీ ఒప్పుకున్నాను. నేను ఉద్యోగంలో ఉన్నాను కనుక లోన్ దొరకడంలో ఇబ్బంది లేదు. బహుశా ష్యూరిటీ అడుగుతారేమో... నీవు ఇస్తావు కదూ?"

లావణ్య జవాబు చెప్పలేదు.

"ఏమిటీ మౌనం? అంత తర్జనభర్జన లేమిటి?" అని అడిగాను తీవ్రంగా.

"ఆలోచించాలి, మృదులా!" అంది.

నాకు ఒళ్లు మండింది. "ఏమిటి నువ్వు ఆలోచించేది? నేనేం పారిపోతున్నానా లేక ఉద్యోగం ఊడిపోతుందా? పోనీలే, నీవు కాకపోతే ఇంకొకరు. మిశ్రాను అడుగుతాను. ప్రొఫ్ అయినా ఫర్వాలేదు. జోన్- ఆ మాటకొస్తే ఈ ఆఫీసులో అందరూ ష్యూరిటీ ఉండగలరు. అంతమాత్రం గుడ్‌విల్ నాకుంది" అన్నాను రోషంగా.

లావణ్య పడిపడీ నవ్వుతోంది.

"అంత నవ్వెందుకు వస్తున్నట్లో?"

"నీ ఉడుకుమోత్తనం చూసి. నేను ఆలోచించేది నీ ష్యూరిటీ గురించి కాదు. నీకు హామీ ఉంటే నా కొచ్చే లాభ మేమిటని?"

"అదా... అలా చెప్పు. నిన్ను జామ్మని నా కొత్త మారుతీలో... కాదు; సాంత్రోలో... కాదు; ఇండికాలో... నోనో... జెన్‌లో..."

"హోల్డాన్! అన్ని కార్లలో లిఫ్ట్ ఇస్తావని నేననుకోను. ముందు నీ కారేదో నిర్ణయించుకో. ఆ తరువాత తిప్పుదువుగాని. ప్రస్తుతానికి క్వాలిటీలో నా కొక లంచ్ చాలు."

"ఈ రోజే!"

"అవును ఈ రోజే. నేను భవిష్యత్తుకంటే వర్తమానాన్ని ఎక్కువగా నమ్ముతాను."

ఆ మధ్యాహ్నం క్వాలిటీలో లంచ్ అయింది. నేను ఇండికా కొనాలని నిర్ణయించుకున్నాను. దాని డిజైన్ ఇప్పుడెంతో బాగుంది. గ్రాండ్‌గా ఉంటుంది. పైగా డీజల్. పెరుగుతున్న పెట్రోలు ధరలు తట్టుకోలేం. డీజలే మెరుగనిపిస్తుంది.

ఇక అప్పటినుంచి నా దృష్టి అంతా రోడ్డుమీద వచ్చిపోయే కార్లమీదే. ముఖ్యంగా ఇండికా మీద. ఏ రంగు అనేది నిర్ణయించుకోవడం కష్టమనిపించింది. చివరకు చంద్రకాంతికి అంటే మూన్‌బీమ్ రంగుకు సెటిల్ అయ్యాను.

అనుకున్న దానికంటే ముందుగానే బ్యాంకు నుంచి ఫోను వచ్చింది.

"మీరు కారు లోన్‌కు అప్లయి చేశారు..." చాలా మర్యాదగా, స్నేహపూర్వకంగా వినిపించింది గొంతు. అవును. ఆ రోజు మాట్లాడిన ఆఫీసరే. తన పేరేమని చెప్పాడు వినీత్... ఎస్... వినీత్.

"హలో మిస్టర్ వినీత్! హౌ ఆర్యూ? థాంక్స్ ఫార్ ద కాల్. లోన్ శాంక్షన్ అయిందా? నేను బ్యాంకుకు ఎప్పుడు రావాలి?"

"సారీ, మేడమ్, మీ లోన్ అప్రూవ్ కాలేదు."

నాకు నోట మాట రాలేదు.

"హలో... హలో..."

"ఎందుకు? ఎందుకు అప్రూవ్ కాలేదు?"

"సారీ, మేడమ్, మా సాఫ్ట్‌వేర్ మీ అప్లికేషన్ తీసుకోలేదు."

"సాఫ్ట్‌వేరేమిటి? కంప్యూటరేనా!"

"అదే అనుకోండి. లోన్‌కోసం మేమొక సాఫ్ట్‌వేర్ తయారు చేశాం. ఇప్పుడు అప్లయ్ చేసినవారందరి వివరాలు దానిలో ఫీడ్ చేస్తాం. అర్హులైనవారిని అది ఎన్నుకుంటుంది. తక్కినవారిని తిరస్కరిస్తుంది."

"ఎందుకలా జరిగింది? మీరడిగిన అన్ని వివరాలూ ఇచ్చాను కదా? మీ షరతులకు ఒప్పుకున్నాను కదా? మీరుకూడా అన్నీ సరిగానే ఉన్నాయి, సింపుల్ ప్రాసెస్ అన్నారు కదా!"

"నిజమే అనుకోండి- కాని బ్యాంకు పద్ధతి ప్రకారం..."

"మీ మేనేజరుతో మాట్లాడవచ్చా?"

"ప్లీజ్, మేడమ్... ఎస్ మేడమ్!"

కాస్సేపటికి మేనేజరు గొంతు వినిపించింది. "చెప్పండి, మేడమ్, సమస్యేమిటి?"

"అంతా సమస్యే. మీరు అంతంత ఆకర్షణీయమైన ప్రకటన లిస్తారు. మీరు కోరిన వివరాలిస్తూ, మీ కండిషన్లు అంగీకరిస్తూ మేము అప్లికేషన్లు పెట్టుకుంటాం. మీరేమో మీ సాఫ్టవేర్ రిజెక్టు చేసిందని కొట్టిపారేస్తారు. ఇంతకూ నా కారు లోన్ ఎందుకు శాంక్షన్ కాలేదు? కారణాలు తెలుసుకోవచ్చా? కారణాలు తెలుసుకునే హక్కు మాకు లేదా?"

"అలా అని కాదు, మేడమ్! మా కస్టమర్ల తృప్తే మా లక్ష్యం."

"మరి..."

"మా సాఫ్టవేర్..."

"థాంక్యూ. దీనిగురించి ఇదివరకే విన్నాను. మీరు కారణాలు చెప్పగలిగితే సంతోషిస్తాను."

"మ్...మ్..."

"చెప్పండి."

"చూడండి- మీకోపం నాకు అర్థమవుతోంది. కాని, మా బ్యాంకు పద్ధతులను బట్టి పోవాలి కదా! మా సాఫ్టవేర్ మీ క్రెడిట్ రేటింగ్ చాలా తక్కువగా చూపిస్తోంది. ప్రస్తుతానికి మేం చేయగలిగిందేమీలేదు."

"నా క్రెడిట్ రేటింగ్ ఎందుకు తగ్గిందంటారు? మీరు అనుభవమున్నవాళ్ళు కదా! చెప్పండి."

అతనేమీ మాట్లాడలేదు.

"మా ఆఫీసునుండి ఆదాయం సర్టిఫికెట్ కావాలా లేక పర్మిషన్ కావాలా?"

"అటువంటిదేమీలేదండీ."

"మరేమిటి? ఈ సస్పెన్సేమిటి?"

"మీరెందుకింత పట్టుబడుతున్నారు, మేడమ్! లోన్ శాంక్షన్ చేయడం, చేయకపోవడ మనే తుది నిర్ణయం బ్యాంకుదేనని మీకు తెలుసుకదా?"

"తెలుసు కాని, ఈ సందర్భంలో మీ రూలు ఎటువంటిదైనా మీరు నాకు చెప్పవచ్చు."

"ఇది బ్యాంకు రూల్ కాదనుకోండి. లోన్ ఇచ్చేటప్పుడు ఇతర విషయాలు కూడా గమనిస్తారు కదా! ప్లీజ్, మీరు మరోలా అనుకోకండి..."

"ఫర్వాలేదు. చెప్పండి."

"మీకు ఫ్యామిలీ లేదు కదా, మేడమ్! ఒంటరిగా అద్దెకు తీసుకున్న అపార్టుమెంటులో ఉన్నారు కదా. ఇది గొప్ప సోషియల్ రిస్క్. అయినా, క్రెడిట్ విషయంలో ఇదంతా చూస్తారు..." టెలిఫోన్ పెట్టేశాను. కాగితం మీద రూల్ లేదుగాని, వీళ్ల కామన్ సెన్స్ అలా చెపుతుంది. స్త్రీ ఒంటరిగా జీవించడం ప్రమాదం. దీనికి సమాజంలోని హెచ్చుతగ్గులు అన్వయించవు. ఎప్పుడు, ఎవరామెను కొల్లగొడ్తారో, పీక నొక్కుతారో చెప్పడం కష్టం. ఈ భద్రతారాహిత్యం స్థిరపడిన వ్యవస్థలలోకి కూడా చాపకింద నీళ్లలా చేరుకొంటూంది. హై క్రెడిట్ రిస్క్- నిజమే. అప్పు విషయంలోనే కాదు; అన్ని విధాలా ప్రమాదమే. దీనికి రూలుండదు కాని, జగమెరిగిన సత్యం. ది గ్రేట్ రిస్క్!

ఆంధ్రప్రభ వారపత్రిక

9 మే 2003